ఓం

శ్రీరామ

శ్రీ చన్ద్రమౌళీశ్వరాయ నమః

**శ్రీ వేదధర్మ పరిపాలనా సభ ( Regd )**

**కుంభకోణమ్**

ప్రథమ ప్రచురణ

# శ్రీ కృష్ణ స్మరణము - సకలలోక హితకరము

**నమో బ్రహ్మణ్య దేవాయ గోబ్రాహ్మణ హితాయ చ ।**

**జగద్ధితాయ కృష్ణాయ గోవిన్దాయ నమో నమః ॥**

బ్రహ్మ నిష్ఠుడైన దేవుడు, గోవులకి, బ్రాహ్మణులకి, (తద్వారా) సమస్త లోకాలకి క్షేమాన్ని చేకూర్చేవాడు, వేదవేద్యుడు అయిన శ్రీకృష్ణునికి నమస్కారము. మరల మరల నమస్కారము.

ఇది శ్రీ మహాభారతములోని శాన్తి పర్వములోని శ్లోకము. ప్రొద్దున నిద్రలేస్తూనే దీనిని పఠించాలని పెద్దలంటారు.

**దీని విశేషాలు కొన్ని :**

ప్రపంచములోని సమస్త చరాచర జీవరాసుల క్షేమమే మన మౌలిక బాధ్యత.

**స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః ।**

**గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు ॥**

ఈ మంగళ శ్లోకము మనకందరకు బాగా పరిచితమైనదే. ప్రజలందరకు శుభం కలగాలి. రాజులు దేశాన్ని న్యాయం తప్పకుండా పరిపాలించాలి. గోవులకి, బ్రాహ్మణులకి నిత్యము శుభము కలగాలి. లోకాలన్నీ నిత్యము సుఖంగా ఉండాలి అని దీని అర్థము. దీనిలో – లోకాలన్నిటికీ – ప్రజలందరకూ క్షేమము – శుభము కలగాలని సామాన్యంగా అంటూనే – మళ్ళీ ప్రత్యేకంగా గోవులకీ, బ్రాహ్మణులకీ శుభం కలగాలనీ – వాళ్ళకి అభివృద్ధి కలగాలనీ ప్రార్థించటమేమి? వాళ్ళు అందరూ ప్రపంచంలో భాగమేగా? వాళ్ళని ఇలా ప్రత్యేకంగా ప్రస్తావించటంలోని మర్మమేమో తెలియాలి.

**జ్ఞానసంబంధ స్వామివారి** ఒక ప్రసిద్ధ కీర్తన **వైయగంతుయార్ తిర్గావే** అంటూ ముగుస్తుంది. దీనిలో ప్రత్యేకంగా **వాచక అందనార్ వాచక ఆనినామ్** అని స్పష్టంగా పేర్కొన్నారు. కారణం మనం విచారించి తెలుసుకోవాలి. ఇలా గోబ్రాహ్మణులని ప్రత్యేకించి ప్రస్తావించటం శైవ – వైష్ణవ – వైదిక సంప్రదాయాలన్నిట సామాన్యమే. కాగా దీని హేతువుని విచారించి, ఆ రహస్యాన్ని తెలుసుకొనటం మన బాధ్యత. మన అవసరం. ఎవరికి ఏ సందేహం వచ్చినా (జీవితం/ఆధ్యాత్మిక విషయాలలో) దానికి భగవద్గీతలో సమాధానం సిద్ధంగా ఉంటుంది.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః ।**

**పార్థోవత్సస్సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥**

– అని భగవద్గీత మంగళశ్లోకాలలో ఒకటి మనకు తెలిసినదే. ఉపనిషత్తులన్నీ గోవులు. శ్రీకృష్ణుడే పాలుపిండే గొల్లడు. అర్జునుడు దూడ. భగవద్గీతా రూపమైన అమృతమే (జ్ఞానామృతమే) ఆ పాలు. సుధి (మంచి బుద్ధిగల విద్వాంసుడు) ఆ పాలని అనుభవిస్తాడు – అని దీని భావము. పాలు తీయటానికి ఆవు దగ్గరకి

దూడని కూడ తీసుకుపోవాలి. పాలు ఆ దూడకే గాక ఇతరులకి కూడా లభిస్తాయి/ఉపయోగిస్తాయి. అలాగే గీతాశాస్త్రం కూడా. మనలో ఎవరికి ఎట్టి సందేహాలు ఉన్నా తీరుస్తుంది. ఎవరు ఏ ప్రశ్నవేసినా దానిలో సమాధానం సిద్ధం.

ప్రపంచంలో చాలా పుస్తకాలు ఉన్నాయి. కాని కొన్ని కొన్ని సందర్భాలలో కొన్నిటిని మాత్రమే ముఖ్యంగా గుర్తిస్తాం. అందుకు ప్రత్యేకమైన కారణాలుంటాయి. ప్రస్తుతకాలంలో భగవద్గీతని మహా మనోహరమైన తత్త్వ శాస్త్ర గ్రన్థంగా అందరూ గుర్తించారు. అది వేరే విషయం. దీనిలోని మౌలిక విషయాలపై ఎవరికీ భేదాభిప్రాయాలు ఉండవు. అందరూ అంగీకరిస్తారు. మన ఈ చర్చ ప్రారంభంలో తలెత్తిన మన సందేహానికి ఇలాంటి గ్రంథం నుండి తగు సమాధానం లభిస్తే అది అందరికి ఆమోదయోగ్యంగా ఉంటుంది.

మానవులమైన మనం ఈ భూమిపై ఎలా జీవిస్తున్నామో ఒకసారి పరిశీలించుకుందాం. ఏదైనా ఒక వస్తువు ఒక ప్రాంతంలో ఎక్కువగా లభిస్తూ ఉంటే మనం దానిని అది లభించని ప్రాంతాలకి పంపిస్తూ ఉంటాము. అట్లే మన ప్రాంతాలలో దొరకని వాటిని దిగుమతి చేసుకుని కొనుక్కుంటాము. కంసాలి, వడ్రంగి మున్నగు కార్మికులు మనకి కావలసిన పనులను చేసిపెట్టుచూ ఉంటారు. ప్రతిఫలంగా మనం వాళ్ళకి డబ్బులు ఇస్తాము. మనం గడ్డివేసి ఆవులని పోషిస్తాము. అవి మనకి పాలనిస్తాయి. మనం ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తాము. ప్రభుత్వము మనకి రక్షణ కల్పిస్తుంది. ఈ విధంగా ప్రపంచమంతా పరస్పర సహకారం మీద నడుస్తూ ఉంటుంది.

అట్లే మనం మన సంపదలని ఇతర లోకాలతో (దేవతలతో) మారకం చేసుకోవాలి. వానలంటూ కురిస్తే మనం మన ఇంజనీర్ల ద్వారా వాటిని వాటి ప్రవాహాలనీ ఒడిసిపట్టి మన పంటపొలాలకి తగువిధంగా మళ్ళించుకొనవచ్చు. అంతేగాని (ఇంజనీర్ల ద్వారా) వానలు కురిపించలేము. వానలు కావాలంటే మనం దేవలోకానికి కొన్ని పదార్థాలని సమర్పించుకొనవలసినదే.

వాన ఒక ఉదాహరణ మాత్రమే. మన అవసరాలన్నీ మనకి – మన ఊహకు అందని "పై" నుండి రావలసినవే. ఆ "పై" లోకాలకి మనం చెల్లించవలసిన పన్నులు యజ్ఞయాగాది రూపములైన వేదోక్త కర్మలే. భగవద్గీత చెప్పేది ఇదే –

**సహ యజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః । అనేన ప్రసవిష్యధ్వ మేష వో స్త్విష్ట కామధుక్ ॥**

**దేవాన్ భావయతానేన తే దేవా భావయన్తు వః । పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్యథ ॥**

(భ.గీ. అ.3, శ్లో 10,11)

వీటి భావము:–

సృష్ట్యారంభంలో ప్రజాపతి (భగవంతుడు) ప్రాణులని యజ్ఞాలతో కలిపే సృష్టించి – ఆ ప్రజలని " మీరు ఈ యజ్ఞాలని చేస్తూ ఉండండి. ఇవి మీ మీ కోరికలని, అవసరాలనీ తీరుస్తూ ఉంటాయి. మీకు అభివృద్ధిని, సుఖసంతోషాలని కలిగిస్తాయి. ఈ యజ్ఞాలతో మీరు దేవతలకి ప్రీతిని కలిగించండి. ఆ దేవతలు మీకు ప్రీతిని కలిగిస్తారు. ఇలా పరస్పర సహకారంతో మీరు మరింత శుభాన్ని పొందుతారు." అని ఆదేశించెను. ఇది భగవద్గీత ద్వారా భగవంతుడు మనకి తెలిపిన విషయము.

యజ్ఞములలో మన్త్రము, దేవత, హవిస్సు అని మూడు అంశాలు ఉంటాయి. మన్త్రాలని ఉచ్చరించవలసినది బ్రాహ్మణుడు. హోమానికి ప్రధాన ద్రవ్యం ఆవునెయ్యి. ఈ రోజులో బ్రాహ్మణులు ఇంగ్లీషు

(లౌకిక విద్యలు) చదువుకుంటున్నారు. వేదాలు చదవటం లేదు. ఇంగ్లీషు చదివిన మీదట ఏదో కొంత వేదం చదివినా మన్త్రాలని శాస్త్రప్రకారం ఉచ్చరించటం కుదరటం లేదు. అందువల్ల ఈ రోజుల్లో బ్రాహ్మణుల మన్త్రబలం తగ్గింది. వైదిక కర్మలు సరిగా జరుగక, కర్మానుష్ఠాతలు తగ్గి, వేదాధ్యయనం కూడా సరిగా జరగటం లేదు. ఆవుపాలు, నిత్యకృత్యంగా కాఫీ అవుతున్నాయి (హోమం కాదు). మంచి ఆవుపాలే దొరకటం లేదు. కాబట్టి సరియైన హోమద్రవ్యం ఉండటం లేదు.

ఏతావతా – బ్రాహ్మణులు వేదాధ్యయనం బాగా చేసి, చక్కటి మన్త్రోచ్చారణతో హోమాలు జరిపించాలి. హోమాలకి మంచి ఆవుపాలు, నెయ్యి దొరకాలి. అపుడే ప్రపంచం మొత్తానికి కావలసిన క్షేమం – సుఖం. అందుకనే మనం మొదట్లో చెప్పుకున్న శ్లోకాలలో, గ్రంథాలలో ఆ తిరుజ్ఞాన సంబంధర్ స్వామివారి కీర్తనలలో బ్రాహ్మణులు, గోవుల విషయంలో అలాంటి గౌరవనీయమైన ప్రత్యేక ప్రస్తావనలు ఉన్నాయి. యజ్ఞాల ద్వారా లభించే లాభాలు లోకం మొత్తానికే గాని – కేవలం ఆ బ్రాహ్మణులకి, గోవులకి మాత్రమే పరిమితం కాదు. లోకం సుభిక్షంగా ఉండాలంటే యజ్ఞాలు చక్కగా జరుగుచు ఉండాలి. దానికై గోవులకి, బ్రాహ్మణులకి తగిన సౌకర్యం ఉండాలి.

**ప్రపంచం మొత్తం క్షేమానికి, అభివృద్ధికీ ఇదే (యజ్ఞమే) ఆధారం. బ్రాహ్మణులు నిస్స్వార్థంగా దీనికై పాటుపడాలి. అది వారి బాధ్యత. వారి ధర్మం. "ఎన్ని కష్టాలు వచ్చినా, ఎంత ఇబ్బందిగా ఉన్నా ప్రపంచ క్షేమానికై నేను చేయవలసిన నా వంతు సేవ ఏమనగా – వేదోక్తమైన కర్మలను యథావిధిగా ఆచరించటమే. తద్వారా మాత్రమే ప్రపంచానికి నిజమైన యోగక్షేమాలు సిద్ధిస్తాయి. భగవంతుడు సంతోషించేది అట్టి కర్మలతోనే. ఇట్టి ధర్మకర్మలే నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలన్నిటికీ పరిష్కారము" అని ప్రతి బ్రాహ్మణుడూ హృదయపూర్వకంగా భావించాలి. శక్తివంచన లేకుండా కృషిచేయాలి.**

ఇదే మన భారతీయ సిద్ధాన్తము. భారతీయులు – శైవులు/వైష్ణవులు/శాక్తేయులు ఎవరైనాసరే – భగవద్భక్తులందరిదీ ఇదే సిద్ధాన్తము. అందరకు అన్నింటకీ ముందు కావలసినది భగవదనుగ్రహమే. కాబట్టి ప్రతిరోజూ నిద్రలేస్తూనే –

**నమో బ్రహ్మణ్య దేవాయ గోబ్రాహ్మణ హితాయ చ ।**
**జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః ॥**

అనే ప్రార్థన పఠిస్తూ, మన మనస్సు – వాక్కు – దేహం అనే త్రికరణాలని భగవదర్పణం చేసుకోవాలి.

ఇది శ్రీ **పి.ఆర్. కన్నన్ (నవీ ముంబాయి) వారి ఇంగ్లీషు అనువాదము ఆధారముగా.**